# నిజాయితీ మధ్యలో నిప్పులాంటి మోసం

"నీరజా! ఆరోజు నువ్వు ఇంటర్వ్యూకి వచ్చిఉంటే నాకి ఉద్యోగం దొరికి ఉండేదికాదు"

"నాకు వచ్చిఉండేది అంతేకదా!" అతనికి మరింత దగ్గరగా జరిగింది నీరజ.

"అదికాదు నీరజా! నీకంటె నాకు ఉద్యోగావసరం చాలా ఉంది"

"అందుకే నీకువచ్చింది స్వరూప్. నాకు చాలా సంతోషంగా ఉంది. ఇంక ఆగొడవలన్నీ ఎందుకులే. నీవంటి ఆదర్శాల గల ఉత్తముడు నాజీవితానికి తోడుగా లభించాడు అంతే చాలు" అతని ఒడిలోకి ఒరిగిపోతూ పలికింది నీరజ.

ఆరోజు ఉదయమే ఇద్దరికి వివాహమైంది రిజిస్ట్రారాఫీసులో. సాయంకాలం కావలసినవాళ్ళకి చిన్నపార్టీ ఇచ్చారు. స్నేహితులు ఇద్దరిచేత పూలదండలు మార్పించారు. స్వరూప్ ఆశయాలను అందరూ ఎంతగానో మెచ్చుకున్నారు. పెళ్ళిళ్ళు అసలు అంత నిరాడంబరంగా జరిగేకాలం రావాలన్నారు.

పెళ్ళికూతురు నీరజ కూడా స్వరూప్‌ని మనస్సులోనే ఆరాధ్యదేవతగా నిలుపుకుంది. పెళ్ళిచూపులకే అంగీకరించలేదు.

నీరజ ఇంట్లో మామూలుగా కలుసుకున్నారు కట్నకానుకలు లేవు. పెళ్ళిఖర్చులేదు. అందుకే స్వరూప్‌వంటి వ్యక్తే ఉండదన్నారు అంతా. నీరజ మనస్సుకూడా ఆగౌరవంతో నిండిపోయింది.

“నీరజా! నేచెప్పేది వినాలి”

“అలాగె వింటున్నా చెప్పు స్వరూప్”

“ఆరోజు రైల్లో నీసర్టిఫికెట్లు పోయాయికదా! మళ్ళీ నీకు జాగ్రత్తగా అందాయికదా!”

“అవును స్వరూప్. ఎలాపోయాయో అలాగె అందాయి. ఎవరో భద్రంగా రిజిష్టర్‌పోస్టులో పంపించారు. పైగా ఈ వూరి స్టాంపేఉంది అందిమీద. ఇప్పటికి నాకు చిత్రంగానె అనిపిస్తుంది.”

“అదిసరేకాని నీరజ ఆరోజు నా రూంలో ఉన్నావుకదా! నీకు భయమనిపించలేదా!”

“రైల్లోనె నీప్రవర్తన నాకు నమ్మకంకలిగించింది. అందుకే నీరూంలో నీతో ఉండడానికి భయమనిపించలేదు.”

“మీవాళ్ళు ఎవరూరాక స్టేషన్‌లో నువ్వు కంగారుపడు తూంటె నేను చూడలేకపోయాను. నీకళ్ళలో నీళ్ళు చూడగానె నిన్ను దగ్గరకు తీసుకుని ఓదార్చాలనుకున్నాను”

నీరజ ముఖం సిగ్గుతో వాలిపోయింది.

“నీరజా! ఏమాలోచిస్తున్నావు? అనాడు నీపక్కనే నడు స్తున్నప్పుడు, నీకుతాజ్‌మహల్ చూపిస్తున్నప్పుడు గదిలో నా పక్కమంచంమీద పూలబాలలా పడుకున్నప్పుడు నా మనస్సును ఎంత అదుపులో పెట్టుకున్నానో తెలుసా” సున్నితమైన ఆమె చెక్కిళ్ళు చేతితో తడిమాడు.

నీరజకు గతమంతా ఒక్కసారి కళ్ళముందు మెదిలింది.

సికింద్రాబాదులో ఎ.పి. ఎక్స్ప్రెస్ బయలుదేరబోతోంది. రైలునిండా జనంఉన్నారు. ఇంకా కొంతమంది హడావిడిగా అక్కడ నిలబడ్డవారిని తోసుకుంటూ రైలు ఎక్కుతున్నారు.మరో అంతమంది జనం రైలు పొడుగుతా గుంపులు గుంపులుగానిలబడి మాట్లాడుతున్నారు.

"అమ్మా! నీరజ టిక్కెట్టు, డబ్బు జాగ్రత్తసుమా. పెట్టె జాగ్రత్తగాచూసుకో"

"అలాగె నాన్నా! నువ్వు అన్నిసార్లు చెప్పనక్కరలేదు. అన్నీ జాగ్రత్తగా చూసుకుంటాను"

"మన రామం స్టేషన్కి వస్తాడమ్మా! మనంరాసినఉత్తరం మొన్ననే అందిఉండాలి. అయినా మనంఇచ్చినటెలిగ్రాం ఈపాటికి అందే ఉంటుంది"

"అలాగె నాన్నా" గొంతుకతగ్గించి మాట్లాడుతోందినీరజ. తండ్రి అంత గట్టిగా మాట్లాడుతూంటె చూసేవాళ్ళంతా ఏమను కుంటారోనని కాస్త సిగ్గుపడి ఎవరైనా వింటున్నారేమోనని అటు ఇటు చూసింది. ఎవరి గొడవల్లో వాళ్లుఉన్నారు. "హమ్మయ్య" అనుకుంది.

అవేమి గమనించే స్థితిలోలేరు రాజారావుగారు.మొదటిసారి వంటరిగా ఢిల్లీవెడుతోంది. మేనల్లుడికి స్టేషన్కివచ్చి రిసీవ్ చేసు కోమని ఉత్తరంరాసాడు. అందుకే అంతకంగారు. పైగా రైళ్లలో దొంగతనాల సంగతి, దోపిడీలసంగతి పేపర్లో చూస్తూనేఉన్నాడు. అందుకే మరింత కంగారుపడుతున్నాడు.

"రైలుదిగగానె తిరుగుప్రయాణానికి రిజర్వేషన్ చేయించుకో తెలిసిందా! కంగారుపడకుండా ఇంటర్వ్యూ చెయ్యమ్మా!"

ఎం.ఎస్.సి పాసైన కూతురు ఆయనకంటికి ఇంకా చిన్న పిల్లలాగె కనబడుతోంది.

"అలాగె నాన్న" నీరజమాటలు పూర్తికాకుండానె రైలు కదిలింది. తండ్రి కనబడేంతవరకు చెయ్యి ఊపింది. అంతలోనె రైలు వేగం పుంజుకుంది.

కాళ్లకిందనున్న పెట్టె, బాగ్ మరోసారి చూసుకుంది. చేతి బాగ్‌లో ఉన్న జనరల్‌నాలెడ్జి బుక్ పైకి తీసుకుంది. అప్పుడు చూసుకుంది తనపక్కసీట్లో, ఎదురు సీట్లలో ఎవరు ఉన్నారో పక్కన ఎవరో కాస్త వయసుమళ్లిన దంపతులు హిందీలో ఏదో మాట్లాడుకుంటున్నారు. ఎదురుగా కూర్చున్న మరో ఇద్దరు మధ్య వయస్సులోఉన్న మగవారు మరాఠీలో ఏదో మాట్లాడుతున్నారు. తనకు ఎదురుగాఉన్న ఒక్కసీటుమాత్రం ఖాళీగావుంది. ఒక్కరూ తెలుగు వచ్చినవారుకాదు. పైగా అందరూ కొత్తవారు. ఎందుకో చెప్పలేని దిగులు మనస్సులో ప్రారంభమైంది. మొదటిసారిగా అంతదూరం పైగా వంటరిప్రయాణం.

"స్టేషన్‌కి రామం అన్నయ్య వాళ్లు రాకపోతే?" అలా అనుకోగానె ఆమెగుండె వేగంగా కొట్టుకుంది. ఏదైన ప్రయాణం చెయ్యక తప్పదు. లోపల భయంగా ఉన్నా పైకి ధైర్యంగానె కూర్చుంది. చేతిలో ఉన్న పుస్తకం తెరచి పేజీలు తిరగెయ్యడం ప్రారంభించింది. ఎందుకో మనస్సు పేజీల్లోని విషయాన్ని అనుసరించలేక పోతోంది.

ఇంతలో ఒకతను కర్చీఫ్‌తో మొహం తుడుచుకుంటూ వచ్చి నీరజ ఎదురుగా కాళీ ఉన్న సీట్లో కూర్చున్నాడు

పొడవుకు తగిన లావుతో ఆకర్షణీయమైన ముఖంతో ఉన్న ఆ యువకుణ్ణి చూడగానె నీరజ మనస్సులో ఏదో తెలియని మధురానుభూతి చోటుచేసుకుంది. తలెత్తి మరోసారి అతన్ని చూసింది.

అతను ఇవేమి పట్టించుకునే దృష్టిలో ఉన్నట్లు లేడు. తన సీట్లో పెట్టుకున్న బ్యాగ్ తెరిచాడు. జనరల్ నాలడ్జిబుక్ తీసుకున్నాడు. అది చదువుకోవడంలో లీనమయ్యాడు.

అతను పలకరిస్తే మాట్లాడాలనుకుంది నీరజ. కాని అతను పలకరించలేదు.

ఎవరి ధోరణిలో వారు ఉన్నారు. కాలం గడచిపోతూనె ఉంది. మధ్యాహ్నం కాగానె పక్కనున్న దంపతులు డబ్బాలు తీసి చపాతీలు, కూరలేసుకుని తినడం ప్రారంభించారు, నీరజ వద్దన్నా వినిపించుకోకుండా రెండు చపాతీలు ఇచ్చారు. నీరజ తాను తెచ్చుకున్న పులిహోర తీసివాళ్ళకు ఇచ్చింది. తర్వాత వాళ్ళు ఇచ్చిన టీ కూడా తాగింది.

ఎదురుగా కూర్చున్న అతను కిందికి దిగి వెళ్ళి ఏమితిని వచ్చాడో నీరజ చూడలేదు. తిరిగి పుస్తకం చేత పట్టాడు. పూర్తిగా చీకటి పడకుండానె కంపార్టుమెంటులో లైట్లు వెలిగాయి. ఎదురుగా కూర్చున్న అతను చదువుతున్న పుస్తకం మూసేసి బ్యాగ్‌లో పెట్టాడు. వళ్ళు విరుచుకొని లేచాడు. బయటకు వెళ్ళి తిరిగి వచ్చి మళ్ళీ సీట్లో కూర్చున్నాడు.

తలెత్తి నీరజ వైపు చూసాడు. అనుకోకుండా అతన్నీ చూస్తున్న నీరజ చూపులు మరల్చుకుంది.

తర్వాత అందరూ ముందుగానె ఆర్డరిచ్చిన భోజనాలు చేసారు. తొమ్మిది కాకుండానె అందరు బెర్తుల మీద నడుం వాల్చారు. లోయర్ బెర్తులో ఉన్న నీరజ అందరితో పాటు పడు కోక తప్పలేదు. శాలువా కప్పుకొని పుస్తకం తెరిచింది.

"ఎక్కడికి వెడుతున్నారు ?"

తెలుగులో అతను పలకరించేటప్పటికి నీరజకు చెప్పలేని సంతోషమనిపించింది. తలతిప్పి చూసింది.

"ఢిల్లీ" ఆమె మాటలో, ముఖంలో, ఆ సంతోషం వ్యక్త మవుతూనె ఉంది.

"టీ తీసుకుంటారా" అతని ముఖంలో ఏదో ఆనందం. ఆ మాటలో ఏదో ఆత్మీయత.

"ఇప్పుడెందుకండీ" ఎంతో మొహమాట పడింది.

"ఏదో చదువుతున్నారుగా తీసుకోండి." కప్పు అందించ బోయాడు.

అతను ఇంకా పడుకోలేదు. కూర్చునే ఉన్నాడు. అతని పక్క వాళ్ళు ఏదో అలా మాట్లాడుకుంటూనె ఉన్నారు

లేచి నీరజ కప్పు అందుకుంది. తలఎత్తితే పై బెర్తు తగులు తుంది. తల వంచుకుంది.

"రేపు ఢిల్లీలో ఇంటర్వ్యూ ఉందండి. మీరు కూడా అక్క డికేనా"

"మీకెలా తెలుసు" చిరునవ్వుతో అతని ముఖం మరింత అకర్షణీయంగా ఉంది.

"మీరు ఇందాకటి నుంచి చదివిన పుస్తకం" అంది చిరునవ్వుతో అతనితో మాట్లాడటం ఆమెకు ఎంతో సరదాగా అనిపించింది.

"బాగా కనిపెట్టారే" అంటూనె అతను తన ఇంటర్వ్యూ లెటర్ చూపించాడు. నీరజ అందుకుని చూసింది. వెంటనే

"నేను ఇక్కడికే అంది"

"అయితే మీరు నాకు ప్రత్యర్థి అన్నమాట" ఆమాట అంటుంటే అతని కంఠంలోని మార్పు నీరజ గమనించలేదు.

"అలా అనకండి. వేకెన్సీలు ఇరవై కావచ్చు. ఎంత మంది వస్తున్నారో అయినా నాకు రాక పోయినా మీకు తప్పకుండా రావాలండీ"

"థాంక్స్" అన్నాడు వెంటనే" అదేమిటండీ ఏవరైనా ఇంటర్వ్యూకి వెడుతూ మరొకరికి రావాలని అనుకుంటారా?

"ఏమోనండి ఇంత దూరం ఇంటర్వ్యూకి రావడమే నాకు ఏదోలా అనిపించింది. పైగా ఎక్కడ వేస్తారో" అంది కాస్త బెంగగా ముఖం పెట్టి.

"అదేమిటండీ మీరెంతో ధైర్యస్తులనుకున్న"

"ధైర్యం కోసం కాదండీ. ఊరుకాని ఊళ్ళలో ఏంతోచదండీ" అంది నవ్వుతూ.

"మీ క్వాలిఫికేషన్ చెప్పలేదు."

"మిస్. నీరజ ఎమ్. ఎస్. సి. ఫస్టుక్లాస్. మీ సంగతి చెప్పలేదు" కుతూహలంతో అడిగింది.

"స్వరూప్ ఎమ్. కామ్. సెకండు క్లాస్. అతని కంఠం జీరపోవడం ఆమె గమనించలేదు. రాత్రి పన్నెండు వరకు ఇద్దరు కబుర్లు చెప్పుకుంటూనె ఉన్నారు. ఆ కాసేపట్లోనె ఎంతో సన్నిహితునిగా ఊహించుకుంది నీరజ. ఏదో మధురమైన పరిమళం గుండెకు తాకుతుంటె తెలియని ఉత్సాహం ఆవరించింది నీరజలో.

జాకెట్లో పెట్టుకున్న టికెట్లు, డబ్బు చేత్తో తడుముకు చూసుకుంది. సీటు కింద పెట్టె, బ్యాగ్ మరోసారి చూసింది. తలకు పక్కనే హ్యాండ్ బ్యాగ్ అందులోని సర్టిఫికెట్లు చూసుకుంది. అందరూ ఢిల్లీ వరకు వెళ్ళేవాళ్ళె. నిశ్చింతగా నిద్రలోకి జారింది నీరజ.

బాగా వెలుతురు రాకుండానె మెలుకువ వచ్చింది నీరజకి. మొహం కడుక్కుని వచ్చింది. పౌడరు రాసుకుని బొట్టు పెట్టుకుంది. ఎవరూ లేవకుండానె తలదువ్వి జడవేసుకుంది.

"గుడ్‌మార్నింగ్" అన్నాడు లేస్తూనె స్వరూప్.

"గుడ్‌మార్నింగ్" తిరిగి అంది నీరజ.

అంతలో పక్క దంపతులు లేచారు. బెర్తులు వాల్చేసారు. ఈసారి ఫ్రీగా కూర్చుంది నీరజ. అందరికి ఈసారి నీరజే టీలు ఇప్పించింది.

అందరూ సంతోషంగా తాగారు. అందరూ ఢిల్లీ స్టేషన్ కోసం ఎదురుచూస్తున్నారు. మధ్యమధ్యలో ఏదో మాట్లాడుతూనె ఉన్నాడు స్వరూప్.

అంతలో బండి ఢిల్లీస్టేషన్‌కి వచ్చి ఆగింది.

బిలబిలమంటూ జనమంతా దిగారు. స్వరూప్ నీరజ సామాను దింపటానికి సహాయం చేసాడు. అందరూ వెళ్ళిపోతున్నారు. నీరజకోసం వచ్చినవాళ్ళు కనబడలేదు. "మీవాళ్ళు వచ్చాకె వెడతాలెండి" అంటూనె స్వరూప్ ఆగిపోయాడు.

ప్లాట్‌ఫారమంతా ఖాళీఅయింది. కాని నీరజకోసం ఎవరూ రాలేదు. నీరజకళ్ళలో నీళ్ళుతిరిగాయి. స్వరూప్ కంటపడకుండా తుడుచుకోవాలనుకుంది. కాని ఆకన్నీళ్ళకు ఆవిషయం తెలియక ఆమె తుడుచుకుంటున్నా అలా ఉబికివస్తూనె ఉన్నాయి.

"నేనున్నాగా భయపడకండి నీరజగారూ. మిమ్మల్ని ఈ కొత్తప్రదేశంలో వదిలి వెళ్ళిపోతాననుకున్నారా" ఆప్యాయతను గుమ్మరిస్తున్న అతనిమాటలు కొండంత అండగా అనిపించాయి.

"ఇక్కడ ఒక గెస్ట్‌హౌస్‌లో మేనేజరు మా నాన్నగారికి బాగాతెలుసు. అక్కడకు వెళ్లిఉందాం.ఏం భయపడకండి. నేనేదో మిమ్మల్ని మోసంచేస్తాననికాని, మానభంగం చేస్తానని కాని అనుమానించకండి"

ఆతనిమాటలు పూర్తిగా విశ్వాసాన్ని కలిగించాయి.జాకెట్లో లోపలదాచిన మనీతీసిఇచ్చింది. తిరిగి మరునాడు వెళ్లిపోడానికి టికెట్టు తీసుకున్నాడు. అతను రెండురోజులుండి మరీ వస్తానని చెప్పాడు.

అతనివెంట గెస్టుహౌసుకి వెళ్ళింది. అతనితో ఒంటరిగా ఉండాలి. అయినా వెంటనే ఇంటర్వ్యూకి వెళ్ళాలి. అవనీ ఆలోచించే టైంలేదు.

వెళ్లి స్నానంచేసి బట్టలువేసుకుని వచ్చింది నీరజ. తర్వాత స్నానానికి అతను వెళ్ళాడు.

అతను వచ్చేలోపున ఆమె రెడీయై కూర్చుంది.

అతనువచ్చి బట్టలు వేసుకుని తలదువ్వుకుని రెడీఅయ్యాడు

అతనిని వివాహం చేసుకునే అమ్మాయి అదృష్టవంతురాలు అనుకుంది నీరజ.

అతను బేగ్ తాళంతీసి సర్టిఫికెట్లు తీసుకుని తిరిగి తాళం వేసాడు.

ఒకసారి సర్టిఫికెట్లు చూసుకోడం ఎందుకైన మంచిదని నీరజ హాండ్‌బాగ్ తెరచిచూసింది.అంతే నోటమాటరాలేదు.బాగ్‌లో సర్టిఫికెట్లులేవు.

"ఏమైందండి" ఆశ్చర్యంగా అడిగాడు స్వరూప్.

"నా సర్టిఫికెట్లు ఏమీలేవు" వెక్కివెక్కి ఏడుపు ప్రారంభించింది నీరజ.

చంటిపిల్లలా కనబడింది స్వరూప్ కంటికి జేబులో ఉన్న కర్చీఫ్‌తీసి ఆమెకళ్లు తుడిచాడు.

ఒకమూల ఇంటర్వ్యూ టైం అయిపోతోంది.

"రైల్లో ఎవరో నాసర్టిఫికెట్లు పట్టుకుపోయారు. నేను ఇంటర్వ్యూకిరాను మీరు వెళ్లిపొండి" అంటు మళ్ళా ఏడుపు ప్రారంభించింది.

స్వరూప్ ఆమెను ఆస్థితిలో చూడలేకపోయాడు. ఆ రూములో ఒంటరిగా వదలలేకపోయాడు.

బలవంతంగా బయటకు తీసుకువచ్చి రూంకు తాళంవేశాడు. హోటల్లో టిఫిన్ తినిపించి కాఫీతాగించి తనతోపాటు ఇంటర్వ్యూకి తీసుకెళ్ళాడు.

ముందుగా నీరజపేరు పిలిచారు. ఆమె చలనం లేకుండా అలాగె కూర్చుండిపోయింది.

స్వరూప్ పేరురాగానె లోపలికి వెళ్లి పది నిమిషాలలో తిరిగి వచ్చాడు. ఇంకా చాలామందే ఉన్నారు అక్కడ.

"ఎలాచేశారు?" నిర్లిప్తంగా అడిగింది నీరజ.

"చాలా బాగా చేసాను. ఎల్లుండి ఇక్కడ లిస్టుపెడతారుట. అయినా పోస్టులో తెలియజేస్తారులెండి" అన్నాడు ఉత్సాహంగా. దీనంగా అతనివైపుచూసింది నీరజ.

"నాకు రాకపోయినా మీకు తప్పకుండా రావాలి అన్న మాట అప్పుడే మర్చిపోయారా?"

"మర్చిపోలేదు. ఈఉద్యోగం రానందుకుకాదు. నా సర్టిఫికెట్లు" అలా అనేటప్పటికి ఆమె కళ్ళలో నీళ్లుతిరిగాయి. అతని కంటపడకుండా తలదించుకుంది.

"మీసర్టిఫికెట్లు ఎవరికి ఉపయోగిస్తాయండి. వాళ్ళే తిరిగి పంపిచేస్తారులెండి. వాటికోసం బెంగపడకండిలెండి"

అతనివెంట బయటకు వచ్చింది నీరజ.

దగ్గరలోఉన్న చిన్నహోటల్లో భోజనం చేసారు ఇద్దరు. తర్వాత ఆగ్రావెళ్ళే బస్సుఎక్కారు.

ప్రపంచానికే అందాలమహలైన తాజ్‌మహల్ దగ్గరుండి చూపించాడు. అతనిపక్కనే అలా నడుస్తుంటే ఆమెలో తెలియని క్రొత్తఊహలేవో తలెత్తుతున్నాయి. మధ్య మధ్య అతని శరీరం తాకుతూనె ఉంది. జనం రద్దీగా ఉన్నచోట అతను భుజంమీద చేయివేసి నడిపిస్తున్నాడు. మనసులో గూడుకట్టుకున్న బెంగ అతని సాన్నిధ్యంలో సుందరలోకంలా మారిపోతోంది. అతని మనస్సులో ఏముందోమాత్రం బయటపడటంలేదు.

రూమ్‌కి వెళ్ళేటప్పటికి రాత్రి బాగా లేటు అయింది. హోటల్లో భోజనంచేసి వెళ్ళారు. రాత్రి విపరీతమైన చలి. రూంలో ఉన్న రెండుమంచాలు చెరోపక్కకి లాగాడు.

తలుపులు గడియపెట్టి వచ్చాడు. బెడ్‌లైటువేసి పెద్దలైటు తీసేసాడు.

"గుడ్‌నైట్ నీరజగారు" వెళ్ళి తనమంచంమీద రాజాయ్ కప్పుకొని పడుకున్నాడు.

నీరజకు మనస్సులో తెలియని భయంగాఉంది. అంతలోనె అతను గాఢనిద్రలో ఉన్నట్టుగా అతని ఉచ్ఛ్వాస నిశ్వాసాలె చెబుతున్నాయి.

నీరజ నిశ్చింతగా కళ్ళుమూసుకుంది.

ఉదయం నీరజ లేచేటప్పటికే స్వరూప్ స్నానంచేసి బట్ట లేసుకుంటున్నాడు.

నీరజ ఆశ్చర్యపోయింది వెంటనే లేచి బాతురూమ్‌వైపు నడిచింది.

ఆమె స్నానంచేసి బట్టలు వేసుకుని వచ్చేటప్పటికే

"మీకు ట్రైన్‌టైం అవుతోంది. త్వరగా తెమలాలి" హడావిడి చేసాడు స్వరూప్. అయిదునిమిషాల్లో అన్నీ సద్దుకుందినీరజ. ఆటోమీద స్టేషన్‌కి తీసుకువచ్చాడు. అప్పటికే రైలువచ్చి ప్లాట్‌ఫారంమీద ఉంది.

ఆమెసీటు వెదికి కూర్చోపెట్టాడు స్వరూప్. మిల్క్-బ్రెడ్ బిస్కట్లు పాకెట్టు కొనిచ్చాడు.

మొహమాటపడుతూనె పుచ్చుకుంది నీరజ. రైలు కదులుతూంటె ఇద్దరి కళ్ళలోను నీళ్లునిలిచాయి

"మళ్ళీ కలుసుకుందాం" అన్నాడు లేనినవ్వుతెచ్చుకుని.

చెయ్యి ఊపింది నీరజ.

హైదరాబాదు వచ్చినా అతని తలుపులు ఆమె మనస్సులోనుండి పోలేదు. కాని సర్టిఫికెట్లు జ్ఞాపకం వచ్చినప్పుడల్లా మనస్సులో చెప్పలేని బాధగా ఉండేది.

తిరిగి యూనివర్సిటీకి అప్లికేషన్ పెట్టాలనుకుంది.

ఇంతలో ఒకరోజు రిజిస్టరు పార్సిల్లో సర్టిఫికెట్లు అందాయి. ఆమెతోపాటు ఇంట్లోవాళ్లు కూడా చాలా సంతోషించారు.

నీరజకు స్వరూప్ మాటలు గుర్తుకొచ్చాయి. "మీ సర్టిఫికెట్లె ఎవరేం చేసుకుంటారండీ" నిజంగా అలాగే తిరిగి వచ్చాయి.

అప్పుడప్పుడు స్వరూప్ మనస్సులో మెదులుతునె ఉన్నాడు. నీరజ బ్యాంక్ ఆఫీసర్‌గా సెలక్టు అయింది. హైదారాబాదులోనె జాయిన్ అయింది.

ఒకరోజు తండ్రి వచ్చి అమ్మాయి స్వరూప్ అని ఒక పెద్ద ఆఫీసరు ఉన్నాడు అతను నా స్నేహితుని కొడుకే. కట్నకానుకలు తీసుకోకుండా పెళ్ళి చేసుకుంటాడట. పెళ్ళి చూపుల తతంగం ఏమిలేదు. నీరజ ఉలిక్కి పడింది. చెప్పలేని సంతోషం. బహుశా ఆ స్వరూపే అయి ఉంటాడు అనుకుంది. అలాగె జరిగింది కూడా. ఎంత నిజాయితీ గల భర్తలభించాడు.

"ఎందుకు నవ్వుతున్నావు నీరజ" ఆమెలో ఆమె నవ్వు కుంటున్న భార్య చుబుకం పైకెత్తి అడిగాడు. ప్రస్తుతంలోకి వచ్చింది నీరజ.

"నేను కోరుకున్న స్వరూప్ లభించాడు" అంది అతనికి మరింత దగ్గరగా జరుగుతూ.

"నీరజా! ఆరోజు నీ సర్టిఫికెట్లు నేనే తీసిదాచేసా నంటే నమ్ముతావా ?"

"మీరా ?" నమ్మలేనట్లుగా చూసింది నీరజ.

"అవును నేనే. నువ్వు రాత్రి పడుకునుండగా నీ బ్యాగ్ తెరిచి అవి తీసి నాబ్యాగ్‌లో అడుగున పెట్టాను. నువ్వు అమాయకంగా నిద్రపోతున్నావు. నీ బ్యాగ్ మళ్ళీ యథాస్థానంలో పెట్టాను."

అతని ఒడిలో ఉన్న నీరజ లేచి దూరంగా జరిగింది. అంత ఆదర్శవంతుడను కున్న స్వరూప్ మోసగాడిగా ఊహించు

కోలేక పోయింది. ఆమే మనస్సు వికలమై పోయి అక్కడ ఉండ లేక పోయింది.

"నేను చెప్పేది విను నీరజ! లేచి పోయిన నీరజను చెయ్యి పట్టి కూర్చోపెట్టాడు."

"నా తండ్రి రిటైరు అయ్యాడు. పెళ్ళికాని చెల్లి చదువు కుంటున్నా తమ్ముడు ఉద్యోగం కోసం తిరుగుతున్న నేను ఎన్నో ఇంటర్వ్యూలకి వెళ్ళాను. ఎవరో ఒకరు ఆ ఉద్యోగం తన్నుకు పోతున్నారు. ఈసారి నువ్వు వచ్చి ఉంటే నాకా ఉద్యోగం రాదు. నాకంటే క్వాలిఫికేషన్ నీకే ఉంది. పైగా మంచి తెలివి చురుకు తనం నీలో ఉన్నాయి. అన్నిటి కంటే మంచి రూపముంది నీకు. ఎందరో ఇంటర్వ్యూకి వచ్చినా నీలాటి వాళ్ళు నూటికొకరు ఉంటారు. పైగా నీపరిస్థితిని బట్టి చూస్తే నీకా ఉద్యోగం మీద ఆసక్తిఉన్నట్లు లేదు. అందుకే నువ్వు రాకుండా చెయ్యాలని ఆపుచేసాను. నన్ను నమ్మిన నిన్ను మోసం చేసాను. నన్ను క్షమించ గలవా నీరజా! ఈ విషయం చెప్పకుండా ఉంటే నీకు నామీద అను మానమే లేదు. కాని ఈ పాప భారాన్ని నాలో దాచుకోలేక పోతున్నా నీరజ! ఈ పాపం కూడా నాకోసం చెయ్యలేదు. నా వారు తిండిలేక మలమల మాడకుండా చెయ్యవలసి వచ్చింది. ఢిల్లీలో నీకోసం ఖర్చుపెట్టిన డబ్బు ఎక్కడిదో తెలుసా? నా చేతి నున్న వాచీ అమ్మి నిన్ను సంతోష పరచాను నీరజా! "అతని కంఠం గద్గద మైంది. నీరజ వైపు చూసే ధైర్యంలేక తలదించుకున్నాడు. ఎంతో సేపు అలా ఆలోచిస్తూ కూర్చుండి పోయింది నీరజ.

‘‘స్వరూప్, నిజంగా నువ్వు చాలా గొప్పవాడివి నీ ఆశయాల మధ్యలో ఈ చిన్న మోసం లెక్కలోనిది కాదు. నీ నిజాయితీ నన్ను ఉక్కిరి బిక్కిరి చేస్తోంది. నాస్వరూప్’’ అతనీ ఒడిలో వాలిపోయింది. లతలా అతని శరీరాన్ని పెనవేసుకుపోయింది నీరజ. ఆనందంలో ఉక్కిరి బిక్కిరి అయ్యాడు స్వరూప్.